క్లుప్తంగా

సైనిక సంక్షేమ నిధికి రూ.25వేల విరాళం



జేసీకి చెక్కు ఇస్తున్న ఆర్యవైశ్య నాయకులు

పలమనేరు: పట్టణానికి చెందిన శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాయకులు సైనికుల సంక్షేమ నిధికి రూ.25వేల చెక్కును శుక్రవారం జేసీ విద్యాధరికి ఆమె కార్యాలయంలో అందజేశారు. దేశ రక్షణ కోసం శ్రమిస్తున్న సైనికులకు చిరుసాయంగా ఈ విరాళం సేకరించి ఇస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ సంఘం వెల్ఫేర్ ఆఫీసర్ కేవీ రాఘవులు, ఆర్య వైశ్య సంఘ సభ్యులు నరేంద్రబాబు, సురేష్‌కుమార్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు రూ.35 వేలు..



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నదానం పథకం నిర్వహణకు ధానేకు చెందిన పి.వెంకటచలపతి, పుష్పలత దంపతులు రూ.25 వేలు, గోశాలకు రూ.10 వేల చొప్పున విరాళమిచ్చినట్లు ఈఓ ఏకాంబరం శుక్రవారం తెలిపారు. దాతకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

హుండీ ఆదాయం రూ.లక్ష



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: టీటీడీ అనుబంధ రాజనాల బండ శ్రీ లక్ష్మీ నరసింహ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కించారు. మొత్తం 1,00,670 రూపాయలు కానుకల రూపంలో సమకూరినట్లు టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్ర చెప్పారు. ఈ సొమ్మును ఆలయ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

సదుం: మండలంలో అర్హులైన వారి నుంచి నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు శుక్రవారం తెలిపారు. నూతన సభ్యుల చేర్పు, విభజన, పేర్ల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటు తదితర వాటికి స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 7 రకాల సేవలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పలమనేరు: తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా పట్టణానికి చెందిన లారీ కార్మికుల సంఘ నాయకులు జీలు శుక్రవారం ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తొమ్మిదో రోజున నియోజకవర్గంలోని రెడ్డి సంఘం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించింది.

రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, సాంప్రదాయబద్ధంగా అర్చనలు , అభిషేక పూజలు చేసిన అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగుల పూలతో అమ్మవారిని అలంకరించారు. దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను, అలాగే మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదాలను ఆలయ ఈఓ ఏకాంబరం పంపిణీ చేశారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగ జాతర నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ శుక్రవారం బజారువీధి, గిరింపేట, సంతపేట, మురకంబట్టు, పాంచాలపురం, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దొడ్డిపల్లెలోని గంగమ్మను ప్రతిష్ఠించే ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

జాతర చూతము రారండి..


- కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా తిరుపతి గంగమ్మ



గత ఏడాది అమ్మవారి శిరస్సు



మొదట్లో పెంకుటింట్లో అమ్మవారి ఆలయం



ప్రస్తుత అమ్మవారి ఆలయం

కుప్పం రూరల్: పలు శతాబ్దాల పాటు ప్లేగు, కలరా మహమ్మారి ధాటికి కుప్పం ప్రజలు పిట్టాల్లా రాలిపోయేవారు. తమిళ నెల ప్రకారం చిత్ర మాసం (మే నెల)లో వచ్చే ఈ వ్యాధుల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు జనం కుప్పం నుంచి పొరుగు గ్రామాలైన వసనాడు, బండశెట్టిపల్లె, చిన్నకుర్లపల్లె, అనిమిగానిపల్లె, శెట్టిపల్లెకు వలస వెళ్లేవారని, వ్యాధి తగ్గిన తరువాత స్వగ్రామాలకు వచ్చేవారని చరిత్ర చెబుతోంది. అప్పటి వరకు తిరుపతి గంగమ్మకు పూజలు కుప్పంలోని గునేజ్‌బావి (ప్రస్తుత ఆజాద్‌రోడ్డు)లో చేసేవారు. అమ్మవారికి పూజలు చేస్తున్న సందర్భంలో ఒకానొక రోజు కుప్పానికి చెందిన బీఎస్ వజ్రవేలుశెట్టికి గంగమ్మ భవిష్యవాణి వినిపించింది. ఆ సందేశం ప్రకారం ఆయన ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశంలో చిన్న పెంకుటింట అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్లేగు, కలరా వంటి మహమ్మారి వ్యాధులు దూరమయ్యాయని, అమ్మవారే తమను కాపాడుతోందనే నమ్మికతో ప్రజలు జాతర చేయడం ప్రారంభించారు. ఇది జనబాహుళ్యంలో ప్రాచుర్యంలో ఉన్న గాథ.

125 ఏళ్ల క్రితం ప్రారంభమైన అమ్మవారి జాతర ప్రతి ఏటా మే మొదటి మంగళవారం చాటింపుతో జాతర ప్రారంభమై మూడవ మంగళవారం విశ్వరూప దర్శనం సాగుతుంది. ఇప్పటికే చాటింపుతో జాతర సంబరాలు మొదలయ్యాయి. 15 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ముత్తుమారెమ్మ ప్రతిమను వివిధ వాహనాలపై ఊరేగిస్తారు. మూడవ మంగళవారానికి ముందు రోజు సోమవారం అమ్మవారికి అగ్నిగుండం, పచ్చ గెరిగ నిర్వహిస్తారు. మంగళవారం చెరువు కట్టపై పెద్దబావి వద్ద అమ్మవారికి కళ్లకు తెర తొలగించి విశ్వరూప దర్శనం కల్పిస్తారు. అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూంటే జంతుబలులకు అంతే ఉండదు. అమ్మవారి జల నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుంది.

మూలికలతో తయారైన అమ్మవారి శిరస్సు

తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం సందర్భంగా ఏర్పాటు చేసే శిరస్సు మూలికలతో తయారు చేశారని పూర్వీకుల నుంచి వినవస్తున్న మాట. మొదట్లో చింతపండు బబ్బడ, గచ్చక్కాయ, మైనం , వట్టివేరు, ఉసిరికాయ, వేపాకు, బంక..ఇత్యాది వాటితో అమ్మవారి శిరస్సు తయారు చేశారు. ప్రస్తుతం అదే శిరస్సును కాపాడుకుంటూ జాతర నిర్వహిస్తున్నారు.

ఏటా పెరుగుతున్న భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా తిరుపతి గంగమాంబకు ప్రశస్తి ఉండడంతో ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారికి జంతు బలులతో మొక్కులు చెల్లిస్తారు. 19, 20, 21వ తేదీల్లో కుప్పం జాతరకు లక్షల్లో జనం వస్తారని నిర్వాహకులు దీనికి తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా వేషధారణలు

పురుషులు ఆడవారి వేషాలు, మహిళలు మగవారి వేషాలు, చిన్న పిల్లలు అయితే విచిత్ర వేషధారణతో వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఇలా వేషాలు ధరిస్తే వారికి ఉన్న రుగ్మతలు మటుమాయవుతాయని భక్తుల నమ్మిక. దీంతో ప్రతి ఏటా వేషాలు జాతరలో ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మూడు తరాలుగా ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్నా

మా మూడు తరాలుగా తిరుపతి గంగమ్మ ఆలయంలో విధులు నిర్వహిస్తున్నాం. మా తాత సుబ్రప్ప, మా నాయన చిన్నప్ప.. ఇప్పుడు నేను ఆలయంలో పనిచేస్తున్నా మా తాతల కాలం ముందు నుంచి ఈ అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పేవాళ్లు. ప్లేగు, కలరా అంటువ్యాధులు వ్యాపించి జనం వాంతులు, విరేచనాలతో జనం చనిపోయేవారంట! ఆ అమ్మవారే వచ్చి కాపాడినట్లు పెద్దలు చెప్పేవారు. అందుకే అమ్మవారికి పెద్ద ఎత్తున జాతర చేసి మొక్కులు చెల్లించుకుంటాం.

– మునెప్ప, ఆలయ ఉద్యోగి, కుప్పం





తొలినాళ్లలో అమ్మవారి విశ్వరూప దర్శనం చిత్రం (ఫైల్), అగ్నిగుండ ప్రవేశానికి సిద్ధం చేస్తున్న ప్రదేశం

19, 20 తేదీల్లో బాబు కుప్పం రాక

జాతరకు ముఖ్యమంత్రి చంద్రబాబును గంగమ్మ ఆలయ కమిటీఆహ్వానించింది. దీంతో బాబు తిరుపతి గంగమ్మ, యామగానిపల్లె ధర్మరాజుల జాతరకు 19, 20 తేదీల్లో ఇక్కడికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. జాతర కోసం ఆలయ కమిటీ ఇప్పటికే గుండం నిర్వహించే ప్రదేశాన్ని సిద్ధం చేస్తోంది. గుండం ప్రాంతానికి వెళ్లే దారిని సుమారు రూ.60 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది.

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ అంతరాయం

శాంతిపురం: రామకుప్పం, వీ.కోట, శాంతిపురం మండలాల్లోని 18 సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో డివిజనల్ ఇంజినీర్ హిమ్మత్ సాగర్ తెలిపారు. శాంతిపురంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

నేడు జాతీయ జెండాలతో ర్యాలీ

పలమనేరు: పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్న సైనికులకు సంఘీభావంగా శనివారం పలమనేరులో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్టు కళామందిరం నిర్వాహకులు తులసీనాథం నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాసంఘాలు, మాజీ సైనికోద్యోగులు, దేశాభిమానులు పాల్గొనాలని కోరారు.

11న లక్ష్మీ నరసింహస్వామి జయంతి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం దేవళంపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 11వ తేదీ స్వామి వారి జయంతి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు అనంతాచార్యులు తెలిపారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

ఏడూరు, గూడూరుపల్లెలో..

పుంగనూరు: మండలంలోని ఏడూరు, గూడూరుపల్లెలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 11 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కావమ్మ, మారయ్య తిరునాళ్ల ప్రారంభం



సదుం: మండలంలోని భట్టువారి పల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరునాళ్ల వైభవంగా ప్రారంభమైంది. సదుం బెస్త సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో జంగాలకథను వినిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు

- అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- హంద్రీ–నీవా కాలువతో చెరువులకు నీరు నింపాలని రైతుల వినతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

గుడుపల్లె: భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అనంతరం అధికారులతో తాగునీటి సమస్యలపై కలెక్టర్ సమీక్షించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైన గ్రామాలలో బోర్లు వేసి నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో భూగర్భ జలాల మట్టం విషయంలో గుడుపల్లె మండలం చివరి స్థానంలో ఉందని, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ఉపాధి హామీ పథకంలో చెరువుల బలోపేతం, పూడికతీత పనులు, చెరువుల అనుసంధానం పనులు చేయాలని ఆదేశించారు. ఈ దిశగా ఎంపీడీఓ, ఇరిగేషన్ ఏఈలు, ఉపాధి హామీ అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. కాలువల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి చేసి త్వరగా పంపాలన్నారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా చెరువులను నింపే చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నాయకులు టీఎం బాబునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం



సమావేశంలో దళిత నాయకులు

సదుం: దళిత సంఘాలు నిర్వహించే కార్యక్రమాలకు అందరి సహకారం అవసరమని మాజీ ఎంపీపీ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళిత నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులు, ప్రారంభోత్సవం, నూతన అంబేడ్కర్ భవన్ నిర్మాణంపై మాజీ ఎంపీపీ, సీతాపతి సభ్యులతో చర్చించారు. ఉద్యోగ సంఘాల నాయకులు అన్ని కార్యక్రమాలలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, శ్రీనివాసులు, వెంకటరమణ, రాంబాబు, రెడ్డెప్ప, రామచంద్ర, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ఎస్‌బీఐ చెడుగుడు

- బంగారు రుణాల రెన్యూవల్‌కు మోకాలొడ్డుతున్న వైనం
- లబోదిబో మంటున్న రుణ లబ్ధిదారులు



రొంపిచెర్ల ఎస్‌బీఐ బ్యాంకు భవనం

రొంపిచెర్ల: బంగారు రుణాల రెన్యూవల్‌కు స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు మోకాలొడ్డుతున్నారని రుణ లబ్ధిదారులు వాపోతున్నారు. ఎస్‌బీఐలో సుమారు 2,125 మంది బంగారు నగలు తాకట్టు పెట్టి రుణాలు పొందారు. సంవత్సరం లోపే వడ్డీ కడితే తక్కువ వడ్డీ పడుతుందని రైతులు తమ బంగారు రుణాలపై ప్రతి ఏటా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసేవారు. అయితే ఈ ఏడాది ఎస్‌బీఐలో అధికారులు బంగారు రుణాలు తీసుకున్న లబ్ధిదారులు అసలు వడ్డీ పూర్తి చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని ఝలక్ ఇచ్చారు. మరోవైపు బంగారు రుణాలు తీసుకుని వివిధ పంటలు సాగు చేసిన రైతులకు 80 శాతం నష్టం చవిచూశారు. ఈ నేపథ్యంలో పూర్తిగా రుణాలు చెల్లించాలంటూ ఎస్‌బీఐ పీడించడం తగదని, ఇతర బ్యాంకుల్లో వడ్డీ చెల్లిస్తే బంగారు రుణాలను రెన్యూవల్ చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ మాత్రమే అధికారులు వేధిస్తున్నారని లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకుని తమకు రెన్యూవల్ చేసుకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బీఐ నిబంధనల ప్రకారమే..



బంగారు రుణాలు పొందిన వారు అసలు, వడ్డీ చెల్లిస్తేనే రెన్యూవల్ చేయాలని ఆర్‌బీఐ నిబంధనల మేరకే నడచుకుంటున్నాం. ఇతర బ్యాంకులతో మాకు పని లేదు. వడ్డీ చెల్లిస్తే రెన్యూవల్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తే అలాగే చేస్తాం.

–మేనేజర్ భాస్కర్, ఎస్‌బీఐ, రొంపిచెర్ల

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్



బైరెడ్డిపల్లెలో ..

రొంపిచెర్ల: గర్భవతులు రక్త హీనత సమస్య అధిగమించడం కోసం పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ అన్నారు. శుక్రవారం ప్రధామమంత్రి సురక్షిత మాతృత్వ అబియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు.ప్రతి రోజూ గర్భవతులు పాలు, కోడి గుడ్లతోపాటు ఆకుకూరలను తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేసుకున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పులు చేస్తామని, అదే ప్రైవేటు ఆస్పత్రులు సిజేరియన్ చేసి పేదలను దోచుకుంటున్నాయని గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య శిశువుకు జన్మ

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. మహతి ఫౌండేషన్ సౌజన్యంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎం.కొత్తూరులో తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

శేష వాహనంపై శ్రీవారి కటాక్షం



శేష వాహనంపై శ్రీవారు

సదుం: మండలంలోని బూరగమంద శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పూజలు అభిషేకాల అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో శేషవాహనంపై ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ సేవకు అన్నారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.



రథోత్సవం

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వర ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆ తర్వాత మేళ తాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ స్వామివారు రథంపై పురవీధుల్లో విహరించారు. ఇంటింటా స్వామివారు కర్పూర నీరాజనాలు అందుకున్నారు. పుష్పాలంకరణకు ఉభయదారులుగా మల్లిశెట్టి శివశంకర్, శ్రీదేవి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.అలాగే మజ్జిగ, పప్పు వడ పానకం పంపిణీకి నానబాల గణేష్, మాధవి, కడియాల మురళి, చంద్రకళ దంపతులు తోడ్పాటునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేవీ. రాజన్న, వరుణ్ భరత్, జీవన్ ప్రకాష్, కడియాల మహేష్‌బాబు, కృష్ణమూర్తి, పవన్, మురళి, గణేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

గరుడాద్రి కొలువులో జగన్మోహనాకారుడు



కోనేటిరాయస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



గరుడ వాహనంపై భక్తులకు అభయమిస్తున్న శ్రీవారు

- జగన్మోహినీ అవతారంలో శ్రీవారు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం శ్రీకోనేటిరాయ స్వామి జగన్మోహినీ అవతారంలో తిరుచ్చిపై కొలువుదీరారు. భక్త బృందాల కోటాల ప్రదర్శనలు, గోవింద నామస్మరణ మధ్య పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత స్వామివారి సుప్రభాత సేవ, తోమాలసేవ తదితర నిత్య కైంకర్యాల అనంతరం భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కల్పించారు.

గరుడుని భుజ స్కంధాలపై శ్రీవారి విహారం

రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీకోనేటిరాయస్వామి గరుత్మంతుని భుజస్కంధాలపై కొలువుదీరి గ్రామ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

గరుడ సేవకు ముందు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఆలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారిని ఆస్థాన మండపంలో ప్రత్యేక కళ్యాణ వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా ఈ తంతు ముగించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. భజన బృందాలతో పాటు హిందూ ధర్మపరిషత్ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో కంకణ బట్టార్ నరసింహాచార్యులు, డిప్యూటీ స్పెషల్‌గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

కాకాతోపు డాక్టర్‌గా చందనప్రియ



బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని కాకాతోపు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిగా చందనప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.